తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం | సూర్యాపేట | యాదాద్రి భువనగిరి

ఆదివారం 08 మార్చి 2026 | పేజీలు : 8

Follow :



## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి పోలీసు సిద్ధం

- 99 రోజుల కార్యాచరణలో రక్షణ అంశాల్లో పాల్గొంటాం
- రోడ్డు భద్రత,పిల్లల మహిళల భద్రత, డ్రగ్స్ నిర్మూలన...
- విద్య, యువత, పర్యావరణం అంశాలపై అవగాహన కల్పిస్తాం
- సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
రాష్ట్ర ప్రభుత్వం అతి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొనటానికి పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన వివిధ అంశాల పట్ల ప్రజలను యువతను చైతన్యవంతం చేసి కార్యక్రమంలో విజయవంతంగా ముందుకు వెళ్తామని ఎస్పీ నరసింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో సూచించిన అంశాలకు సంబంధించి రక్షణ పరమైన విధివిధానాలలో పోలీస్ శాఖ పాల్గొంటోందన్నారు.దీనిలో భాగంగా కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైల్స్ ను పరిష్కరించడం, అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ కార్యాచరణ, బడుగు బలహీన వర్గాల సంక్షేమం చట్టాల అమలు, పిల్లలు మహిళల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, వ్యవసాయం నకిలీ విత్తనాల నిర్మూలన, విద్యా, యువత క్రీడలు, పర్యావరణం మొదలగు అంశాల మీద ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమాల నిర్వహణ కార్యక్రమాల్లో పాల్గొనడానికి పోలీస్ శాఖ ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని, రోజువారి ప్రణాళిక ప్రకారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పాల్గొంటారని అన్నారు.ఈ 99 రోజుల ప్రణాళికలో రక్షణ పరమైన అంశాల పట్ల పోలీస్ శాఖ ప్రజలను చైతన్యవంతం చేస్తుందని అన్నారు.



**పోలీస్ కార్యాలయాల పరిసరాలు శుభ్రం చేసిన పోలీస్..**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్స్, సర్కిల్, డివిజన్ కార్యాలయాల పరిధిలో పరిసరాలు పరిశుభ్రం చేయడం జరిగింది. జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పోలీస్ పరేడ్ గ్రౌండ్, గార్డెన్ పరిసరాలను పరిశుభ్రం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయం నందు జరిగిన పరిశుభ్రత కార్యక్రమంలో డీఎస్పీ నర్సింహ చారి, ఆర్ఐ జానయ్య, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

**జిల్లా ఇన్చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సన్నాక సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు**





**కనగల్లు, (నల్గొండ) మార్చి 7 (జనంసాక్షి)**
ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధికై సమిష్టిగా కృషి చేయాలని ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి ఉమ్మడి జిల్లాల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల సమీక్ష సనాక సమావేశం శనివారం కలెక్టరేట్ ఉదయాదిత్య భవనము లో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ విద్య, వైద్య, గ్రామ పాలన అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో ప్రజలకు మేలైన పాలన అందిస్తుందని, ఉమ్మడి నల్లగొండ జిల్లాను అన్ని రంగాల లో అభివృద్ధి చేయడం జరుగుతుందని దీనికి ప్రతి ఒక్కరి సహకారం , సలహాలు, సూచనలు అవసరమని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలున్న ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యేలను మంత్రులు ఈ సందర్భంగా కోరారు . అనంతరం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక అమలు తీరుపై ప్రతిజ్ఞ చేశారు. సమీక్ష సమావేశంలో ప్రభుత్వ బీర్ల అయిలయ్య యాదవ్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ నాగార్జునసాగర్, ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, దేవరకొండ ఎమ్మెల్యే బాల్ నాయక్, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కె అనిల్ కుమార్ రెడ్డి ఎమ్మెల్సీ నెలకంటి సత్యం, నల్గొండ జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్, నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ ఎస్పీ శరత్చంద్ర పవర్, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, జిల్లా ఉన్నతాధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఛలో గన్ పార్క్ పోస్టర్ ఆవిష్కరణ

సూర్యాపేట( జనంసాక్షి):
ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చుకునేలా ఈనెల 10న హైదరాబాదులోని గన్ పార్క్ వద్ద చేపట్టే గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డే ను జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జెఏసి జిల్లా ఇంచార్జ్, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిడమర్తి లింగయ్య పిలుపునిచ్చారు.జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద టియు జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఛలో గన్ పార్క్ గోడపత్రిక పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడారు.ఆనాటి దోపిడీ పాలనకు వ్యతిరేకంగా మేధావులు, కవులు, కళాకారులు, విద్యార్థులు, న్యాయవాదులు, సబ్బండ వర్గాల ప్రజలు ఒక్కటై ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా కేసులకు భయపడకుండా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తెలంగాణ ఉద్యమకారులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టియు జెఏసి జిల్లా నాయకులు నవిలె ఉపేందర్,లక్కపాక కృష్ణ, దయాకర్,మహిళా వేదిక రాష్ట్ర నాయకులు గోనె విజయ,ఉమా శ్రీ, సుజాత, ఖమ్మంపాటి లక్ష్మమ్మ, సుకన్య, నిర్మల, సోమమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఆలయ భూముల రక్షణకు కీలక అడుగు

**హద్దురాళ్లు పాతిన అధికారులు**



**గుర్రంపోడు: మార్చి 07 (జనంసాక్షి)**
నల్గొండ జిల్లా గుర్రంపోడ్ మండలం కొప్పోల్ గ్రామానికి చెందిన ఆలయ భూములకు సంబంధించి అధికారులు హద్దురాళ్లు పాతు కార్యక్రమాన్ని చేపట్టి శనివారం పూర్తి చేశారు. ఆలయానికి చెందిన భూములను పరిరక్షించేందుకు మరియు భవిష్యత్తులో ఆక్రమణలు జరగకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. సంబంధిత రెవెన్యూ మరియు ఎండోమెంట్ శాఖ అధికారులు గ్రామంలో ఆలయ భూములను పరిశీలించి, వాటి సరిహద్దులను గుర్తించి హద్దురాళ్లు పాతారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆలయానికి చెందిన భూములు ప్రజల ఆస్తి అని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆక్రమించకుండా కాపాడాలని సూచించారు. ఆలయ భూములపై ఎవరైనా అక్రమంగా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పాతిన హద్దు రాళ్ళ విషయంలో అభ్యంతరాలు ఉంటే సంబధిత శాఖ అధికారులకు తెలియ జేయాలని,ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.గ్రామస్తులు కూడా ఆలయ భూముల రక్షణకు సహకరించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ మరియు రెవిన్యూ అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

జనంసాక్షి

# చండూరులో ప్రజాపాలన - ప్రగతి నివేదిక వైద్య శిబిరం

## 99 రోజుల ప్రణాళికలో భాగంగా పేదలకు ఉచిత వైద్యం



**చండూరు, మార్చి 07 (జనంసాక్షి)**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి నివేదిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, నల్గొండ జిల్లా చండూరు పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం భారీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి చండూరు మండలంలోని నలుమూలల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నిపుణులైన వైద్యులు జిల్లా ఆసుపత్రి నుండి ఆరుగురు స్పెషలిస్ట్ వైద్యులు ఈ శిబిరానికి హాజరయ్యారు. ఇందులో జనరల్ మెడిసిన్, గైనకాలజీ (స్త్రీ రోగ నిపుణులు), పీడియాట్రీషియన్ (పిల్లల వైద్యులు), ఆర్థోపెడిక్ సర్జన్ (ఎముకల నిపుణులు), డెంటల్ సర్జన్ మరియు ఆప్తమాలజిస్ట్ (కంటి వైద్య నిపుణులు) ఉన్నారు. శిబిరానికి వచ్చిన రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. సుమారు 78 మందికి పైగా రోగులు ఇప్పటివరకు పరీక్షలు చేయించుకున్నారని అధికారులు తెలిపారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్నవారిని మరియు శస్త్రచిక్సితలు అవసరమైన వారిని జిల్లా కేంద్రంలోని నల్గొండ ఆసుపత్రికి రిఫర్ చేశారు. వీరిని 102 వాహనాల ద్వారా తరలించి బుధ, శనివారాల్లో ఉచితంగా సర్జరీలు చేస్తామని డాక్టర్ రాజు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు 10 విభాగాలలో ఈ ప్రగతి నివేదిక కార్యక్రమాలను చేపట్టిందని వివరించారు. ప్రైవేట్ ఆసుపత్రులలో భారీగా ఫీజులు చెల్లించలేని పేద ప్రజలకు ఈ ఉచిత హెల్త్ క్యాంప్ ఎంతో మేలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



### భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబుకి శ్రీ పూర్ణగిరి లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ ఆహ్వాన పత్రిక

**భువనగిరి రూరల్, మర్చి 7 (జనంసాక్షి)**
భువనగిరి మండలం నమాత్ పల్లి గ్రామంలో సుదర్శన శ్రీ పూర్ణగిరి లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ ఆహ్వాన పత్రికను భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు, భువనగిరి టౌన్ సీఐ రమేష్, బీబీనగర్ సీఐ ప్రభాకర్ రెడ్డిలకు ఆలయ చైర్మన్ రావి సురేందర్ రెడ్డి అందిచడం జరిగింది.

## విద్యార్థులు వ్యక్తిగత ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత, ఒత్తిడిని జయిస్తే సంపూర్ణ ఆరోగ్యం



**నేరేడుచర్ల, మార్చి 07(జనంసాక్షి)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం ,మున్సిపాలిటీలోని రామాపురంలో గల మహాత్మ జ్యోతిరావు పూలే తెలంగాణ బిసి సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణులు డా. అమృత్ పిల్లను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించారు. నేరేడుచర్ల మండల వైద్య అధికారి డా పున్న. నాగిని మాట్లాడుతూ పిల్లలు తీసుకోవలసిన ఆహారపు అలవాట్లు, వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, పరీక్షల సమయంలో పిల్లలు మానసిక ఒత్తిడి గురికాకుండా అవసరమైన వారికి 14416 టెలీ మానస్ కు సందర్శించ వలసింది గా తెలియచేశారు. అర్బీఎస్కె బృందం డా. ఆరిఫ్, డా. ధర్మ తేజ, సి.హెచ్వో సల్వాది శ్రీనివాస్, నాగరాజు, ఏ ఎన్ ఎం వరలక్ష్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## పంచాయతీ కార్మికుడి మృతి బాధాకరం

### సర్పంచ్ గరిక సత్యనారాయణ

**రామన్నపేట, మార్చి 7 (జనంసాక్షి):**
రామన్నపేట మేజర్ గ్రామపంచాయతీలో గాదె నరసింహ 25 సంవత్సరాల నుంచి పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని స్థానిక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గరిక సత్యనారాయణ అన్నారు. నరసింహ మృతదేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జమీరుద్దీన్ ఉపసర్పంచ్ మోటె రమేష్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ నాసర్, బొడ్డు సాలయ్య, గొలుసుల ప్రసాద్, గంగాపురం శంకర్, మహమ్మద్ జానీ వార్డు సభ్యులు కొమ్ము శేఖర్, మోటె మహేష్, కొమ్ము రామస్వామి, మొహమ్మద్ అంజద్, గొరిగె శేఖర్, సురివి హరిబాబు, ఊట్కూరి శీను తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి 23వ వార్డులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పనులకు శ్రీకారం



**భువనగిరి పట్టణం, మార్చి 7 (జనంసాక్షి)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా భువనగిరి మున్సిపల్ పట్టణంలోని 23వ వార్డులో అభివృద్ధి కార్యక్రమాలను కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు అధికారులతో కలిసి కౌన్సిలర్ వార్డులో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిశీలనలు చేపట్టారుఇంటింటా చెత్త సేకరణలో ప్రజలు సహకరించాలని, తడి చెత్త పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు భంగం కలిగే విధంగా చెత్తను రోడ్లపై లేదా మురికికాలువల్లో వేయకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. అదే విధంగా ప్రజారోగ్యం, రోడ్లు, రైతు సంక్షేమం, విద్య, యువత, క్రీడలు, మహిళల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలన వంటి పలు అంశాల్లో ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు చేపట్టి వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు బండారు రవివర్ధన్, పోకల నాగరాజు, ఐలాపురం బాబు, కడారి అనిల్, బర్రె క్రాంతి, సానిటేషన్ ఇంచార్జ్ బర్రె శ్రీధర్, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## హాలియాలో ఘనంగా మహిళా దినోత్సవం

**హాలియా, మార్చి 7 జనంసాక్షి:**
హాలియా పురపాలక సంఘంలో శనివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజాపాలన ? ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళలకు సన్మానం చేశారు. మహిళా ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, పారిశుద్ధ్య సిబ్బంది, మహిళా ఉద్యోగులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం అధ్యక్షుడు చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తూ వారి ఆర్థిక అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రతి మహిళ స్వయం సమృద్ధిగా ఎదగాలని ఆకాంక్షించారు. పురపాలక సంఘం కమిషనర్ ఎ. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహిళల లేనిదే సృష్టి లేదని, మహిళలే సృష్టికి ఆధారం అని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలిచి ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గౌని రాజా రమేష్, రెండో వార్డు సభ్యురాలు నకిరకంటి అన్నపూర్ణ, ఐదో వార్డు సభ్యురాలు చిట్టిపోలు శ్రీదేవి, ఎనిమిదో వార్డు సభ్యురాలు గౌహర్ జబీన్, తొమ్మిదో వార్డు సభ్యురాలు చెరుపల్లి ముత్యాలు, పద్మ, స్వయం సహాయక సంఘాల మహిళలు, వనరుల వ్యక్తులు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### సర్పంచ్ రహీముద్దీన్

**నేరేడుచర్ల (జనంసాక్షి) :**
అంగన్వాడీ కేంద్రాల సేవలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ షేక్ రహీముద్దీన్ అన్నారు. శనివారం మండలంలో సోమారం గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో ఏఎల్ఎంఎస్ సి కమిటి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రతిగా సర్పంచ్ పాల్గొని ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు బాలింతలు ప్రతిరోజు పౌష్టికారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ యశోద,అంగన్వాడీ టీచర్ ఐశ్వర్య, కళావతి, ఆశలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ పరిశుభ్రతకు అందరూ సహకరించాలి

**హాలియా, మార్చి 7 జనంసాక్షి:**
కొరివేని గూడెం గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రామ సర్పంచ్ పేర్ల వసుమతి రవి పేర్కొన్నారు. ప్రజాపాలన ? ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన రహదారుల ఇరువైపులా పేరుకుపోయిన చెత్త కుప్పలు, పెంట దిబ్బలను తొలగించి, రహదారుల పక్కన పేరుకుపోయిన మట్టిని శుభ్రం చేశారు. గ్రామం శుభ్రంగా ఉంటే ప్రజల ఆరోగ్యం కూడా కాపాడబడుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

**10 జీపీఏ సాధించే విద్యార్థులకు 10వేల నగదు బహుమతి**

**మహర్షి డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫేర్వెల్ డే వేడుకలు**




**సూర్యాపేట(జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ రోడ్డులో గల మహర్షి డిగ్రీ కళాశాల ఫేర్వెల్ డే వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలోని సూర్యాపేట ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పల్లె నగేష్, కరస్పాండెంట్ నారాయణ ప్రవీణ్ కుమార్,చైర్ పర్సన్ జిన్నె రమాదేవి మాట్లాడుతూ తాము ఎలాంటి లాభాపేక్ష లేకుండా నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు 2023లో మహర్షి డిగ్రీ కళాశాలను తిరిగి ప్రారంభించామన్నారు.పట్టుదల, ఏకాగ్రతతో చదివితే సాధించలేనిదంటూ ఏమి లేదన్నారు.విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.సెమిస్టర్ పరీక్షలలో 10కి 10 జీపీఏను సాధించే విద్యార్థులకు రూ.10 వేలు నగదు బహుమతిని అందజేస్తామన్నారు.యూనివర్సిటీ పరిధిలో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారని చెప్పారు.విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు విశ్రమించవద్దని అన్నారు.తాము విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## ముగిసిన భద్రతా వారోత్సవాలు

**మేళ్లచెరువు( జనంసాక్షి)**

స్థానిక మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, మేళ్లచెరువులో జరిగిన 55వ జాతీయ భద్రత వారోత్సవ ముగింపు సభకు ముఖ్యఅతిథిగా కే .వి . శ్రీదేవి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఉమ్మడి నల్గొండ జిల్లా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ ఎన్. శ్రీనివాసరావు, జి.ఎం (పిఎవి) డి. శ్రీరామ్, వి. సూర్యనారాయణ, వేణు నాయుడు, మరియు అన్ని విభాగాల (హెచ్ ఓ డి స్ ) పాల్గొన్నారు.తర్వాత అందరి చేత భద్రతా ప్రతిజ్ఞ చేయించి, ఈ జాతీయ భద్రత వారోత్సవం పురస్కరించుకొని పరిశ్రమలోని పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందికి మరియు కాలనీలో నివసిస్తున్న మహిళా మణులకు, స్కూల్ పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. మరియు పరిశ్రమలో పనిచేస్తున్న వారు సేఫ్టీ స్కిప్టులు నిర్వహించారు ,ఈ పోటీల్లో గెలుపొందిన మరియు స్కిప్టు చేసిన వారికి వారి చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం జరిగింది.ఈ సందర్భంగా కె వి శ్రీదేవి మాట్లాడుతూ, ఈ సంవత్సరం సేఫ్టీ థీమ్ "భద్రతను మెరుగు పరచడానికి, అందరినీ భాగస్వామ్యం చేయండి, అవగాహన కల్పించండి ఉ సాధికారత చేయండి" అని చెప్పారు.యూనిటీ అండ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలు పాటిస్తూ భద్రతను పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం వహించాలని కోరారు.

## సాగర్ ఎడమ కాలువలో ఇద్దరు గల్లంతు

**జనంసాక్షి మిర్యాలగూడ :**వేములపల్లి మండల కేంద్రనీ లో సాగర్ ఎడమ కాలువలో గళ్ళంతయిన సంఘటన చోటు చేసుకుంది. శుక్రవారం రోజు మిర్యాలగూడ పట్టణం సుందర నగర్ కాలనీ కి చెందిన మర్రి రవి, జలీల్,సతీష్ లు హోలీ ఆడి వేములపల్లి వద్ద సాగర్ కాలువ లో స్నానం చేయడానికి వచ్చారు. స్నానం చేస్తుండగా నీటి ప్రవాహానికి రవి,సతీష్ నీటిలో కొట్టుకుపోయి గల్లంతు అయినట్లు స్థానికులు తెలిపారు. సతీష్ మృత దేహం గరిడేపల్లి మండలం పొనుగోడు వద్ద లభించినట్టు తెలిసింది.. రవి అచూకి ఇంకా తెలియలేదు.రవి బంధువుల పిర్యాదు మేరకు వేములపల్లి పోలీస్ లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి గల్లాంతయినా రవి మృతదేహం కోసం గాలిస్తున్నట్లు తెలిసింది.

## ఇంద్రపాలనగరంలో రైతులకు అవగాహన సదస్సు

**రామన్నపేట, మార్చి 7 (జనంసాక్షి):** మండలంలోని ఇంద్రపాలనగరం రైతు వేదికలో శనివారం మండల వ్యవసాయ అధికారి అజాజ్ ఆలీఖాన్,మండల ఏ ఈ వో లు కిరణ్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో నానో ఎరువుల వాడకం,వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం పై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గర్ధాస్ విక్రమ్, ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి,రైతులు మందడి విధ్యాసాగర్ రెడ్డి, రాజన్నగారి రమేష్, రవ్వ నర్సింహా,జిల్లాల ధనుంజయ, గర్ధాస్ వెంకటేష్,శివగల్ల ముత్యాలు, తుమ్మల శేఖర్, బోనగిరి సంజీవ, వెలిమినేటి నరేష్, గడ్డం సాయి, కుకూట్ల సత్తయ్య, ఈర్లపల్లి రమేష్, జిట్టబోయిన వెంకటేష్, రాధారపు నర్సింహా,రాధారపు మల్లేశం, రాస సత్తయ్య,నల్ల గిరిబాబు, పగుడాల సుదర్శన్, నీరుడు వెంకటేష్, మంటి బిక్షం, భూతం బిక్షం,మేకల నరేందర్, చిందం బిక్షపతి, కుకూట్ల సుధాకర్, మండల నర్సింహా, బోనగిరి మధు, మాధం నగేష్, పోతరాజు భాస్కర్, సింగణబోయిన మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## మండల నోడల్ అధికారిగా తహసిల్దార్ - ధ్రువ కుమార్



**చిలుకూరు,మార్చి 07(జనంసాక్షి):** మండల నోడల్ అధికారిగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఆఫీసు నుండి ఉత్తర్వులు జారీ చేశారని తహసీల్దార్ ధ్రువ కుమార్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ చట్టం యొక్క ఉద్దేశం నిత్యం మహిళలు ఏదో రూపంలో వేధింపులు ఎదుర్కొంటున్నారని వీటికి అడ్డుకట్ట వేయడం పై ప్రభుత్వం దృష్టిసారించిందని అన్నారు. పని జరుగుతున్న ప్రదేశాలలో లేదా కార్యాలయాల్లో ఇంటి పనులు చేస్తున్న మహిళలపై లైంగిక వేధింపుల సమస్యలను పరిష్కరించేందుకు మహిళల నుండి ఫిర్యాదులను తీసుకొని అట్టి సమస్యల ను ఏడు రోజులలో పరిష్కరించేందుకు నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. హెల్ప్ లైన్ నెంబర్ 181 టోల్ ఫ్రీ కు ఫిర్యాదు చేయవచ్చు అని అన్నారు.

## అక్రమంగా ఇసుక రవాణా కేసు నమోదు

**నాంపల్లి,మార్చి 07 (జనంసాక్షి)**

మండలంలోని తుంగపాడు గ్రామపంచాయతీ పరిధిలో గల పులుసు వాగు నుండి అక్రమంగా అనుమతులు లేకుండా రాత్రి సమయంలో రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్న వారినీ పట్టుకొని కేసు నమోదు చేసినట్టు నాంపల్లి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ చంద్ర రెడ్డి తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానికుల నుండి వచ్చిన సమాచారం మేరకు రాత్రులు అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు ముక్కుమడిగా వెళ్లి రెండు ట్రాక్టర్లను పట్టుకొని తుంగపాడు గ్రామానికి చెందిన నేతల నరేష్ తండ్రి సత్తయ్య, నేతల నరేష్ తండ్రి రామస్వామిల పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## వాహనాల వేలం పాట లో ఎక్సైజ్ శాఖకు 4,02,380 రూపాయల ఆదాయం



**తుంగతుర్తి మార్చ్ 7 (జనంసాక్షి)** ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన వాహనాలకు తుంగతుర్తి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన వేలం పాటలో ఎక్సైజ్ శాఖకు 4 లక్షల 2 వేల380 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఎక్సైజ్ సీఐ రజిత తెలిపారు, ఇట్టి వేలం పాటలో వాహనాల ఎంవీ ఐ అధికారి ఒక లక్ష 84 వేల 500 రూపాయలు నిర్ధారించగా వేలం పాట ధర 3 లక్షల 41 వేలు జీఎస్టీ61 వేల 380 రూపాయలు కలుపుకొని మొత్తంగా నాలుగు లక్షల 2 వేల 380 రూపాయల ఆదాయం వచ్చినట్లు తెలిపారు ఈ వేలం పాటలో 15 ద్విచక్ర వాహనాలు ఒక మినీ డీసీఎం ను వేలంపాటలో ఉంచినట్లు తెలిపారు , ఈ వేలం పాటలో ఉంచిన 15 ద్విచక్ర వాహనాలతో పాటు ఇక మినీ డీసీఎం కూడా వేలంపాటలో ఆసక్తిదారులు పాట పాడి వాహనాలను పొందారని అన్నారు, వేలం పాట కు నిర్వహించే వాహనాలు చూపెట్టిన ధరలో బహిరంగ వేలం ద్వారా పాట నిర్వహించామని తెలిపారు, వాహనాలు వేలంపాటలో కొనాలని ఆసక్తిదారుల నుండి మంచి స్పందన వచ్చిందని తెలిపారు, ఈ వేలం పాటలో కే స్టీవెన్సన్, ఈసీఐ డిటిఎఫ్ సూర్యాపేట, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు డి, మూర్తి, ఎం జయ ప్రకాష్, తో పాటు సిబ్బంది రామ్మూర్తి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎలిమినేటి మాధవ రెడ్డి 26వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**భువనగిరి పట్టణం, మార్చి 7 (జనంసాక్షి)** కీర్తిశేషులు మాజీ మంత్రి ఎలిమినేటి మాధవ రెడ్డి గారి 26వ వర్ధంతి సందర్భంగా భువనగిరి పట్టణంలోని జిల్లా ఆస్పత్రి సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ పొత్తంశెట్టి మంజుల వెంకటేష్ పాల్గొని మాధవ రెడ్డి గారి సేవలను స్మరించుకున్నారు.అలాగే మాజీ మున్సిపల్ చైర్మన్లు పెంట నరసింహ, నువ్వుల ప్రసన్న సత్యనారాయణ, పొత్తంశెట్టి వెంకటేష్, కౌన్సిలర్ నాయిని పూర్ణచందర్, మాజీ కౌన్సిలర్ తాడురు బిక్షపతి తో పాటు తల్లం కృష్ణ, డొప్ప వెంకటేష్ ముదిరాజు, బచ్చు వెంకటేష్ గుప్తా, యాట కుమార్, నిలికొండ శివకుమార్, ఎలిమినేటి సుమన్ రెడ్డి, బచ్చు శ్రీనివాస్ గుప్తా, దూసరి చంద్రశేఖర్ గౌడ్, మాటూరు ఆంజనేయులు, సుదగాని మహేందర్ గౌడ్, మహేష్ నాయక్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాసేవలో మాధవ రెడ్డి గారు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

## చెన్నారం గ్రామంలో మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన

**కొండమల్లేపల్లి, మార్చి 7 (జనంసాక్షి):** మహిళా సాధికారితకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం తాజాగా మహిళా సంఘాలకు సమాఖ్య భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలకు శాశ్వత వేదికగా ఉండేలా భవనాలు నిర్మించే విధంగా ప్రణాళికలు రూపొందించింది. ప్రతీ గ్రామంలో మహిళా పొదుపు సంఘం సమాఖ్య భవనాన్ని నిర్మించనుంది. మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుండటంతో మహిళా సమాఖ్య భవనాలకు శంకుస్థాపనలు ప్రారంభమయ్యాయి. కొండమల్లేపల్లి మండలంలో 31 సంఘ బంధాలకుగాను 20 భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో భవన నిర్మాణానికి సుమారు 10 లక్షలు వెచ్చించనున్నారు. శనివారం మండల పరిధిలోని చెన్నారం గ్రామ పంచాయతీలో మహిళా సమాఖ్య భవనానికి సర్పంచ్ రామావత్ తులసిరామ్ నాయక్ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి నాగేశ్వరరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జగన్ నాయక్, ఉపసర్పంచ్ కిషన్ నాయక్ వార్డు సభ్యులు చుక్క ముత్తయ్య, ఏడుపుల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ, మోహన్ శ్రీను, సునీల్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం సబ్ కమిటీ వేయడం హర్షనీయం

• ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న • ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మండల ఉద్యమకారుల ఫోరం



**రామన్నపేట, మార్చి 7 (జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమకారులకు, అమరుల కుటుంబాలకు హామీ ఇచ్చిన విధంగా 250 గజాల ఇంటి స్థలం, ఇతర సంక్షేమ పథకాల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక సబ్ కమిటీని ఏర్పాటు చేయడం హర్షనీయమని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం కోసం కమిటీ వేసి వారి డిమాండ్లను పరిష్కరిస్తాం అనడం చాలా గొప్ప విషయమని రాష్ట్ర ప్రభుత్వానికి రామన్నపేట మండల కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా మండల వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అమరులైన నారపాక మల్లయ్య, బొల్లెపల్లి కళింగరాజు,బొడిగ లక్ష్మయ్య, అడ్వకేట్ వాసుదేవరావు,విక్రమ్ సింగ్ ఠాకూర్, గడ్డం స్వామి, మోటే .అంజన్న, ఏలూరు కుమారస్వామి తదితరులు తెలంగాణ ఉద్యమ సమయంలో వారి యొక్క పాత్రను గుర్తుకు చేసుకొని వారి ఆత్మ కు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఉద్యమ సమయంలో ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్క ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం, 25 వేల రూపాయల పించన్, గుర్తింపు కార్డు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు నోముల శంకర్ ఉద్యమ నాయకులు మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్ ఉద్యమ నాయకులు రెబ్బాసు రాములు, బందెల రాములు, బొడ్డుపల్లి లింగయ్య, పాండురంగా చారి, గడ్డం యాదగిరి, ఏలూరు రవి, యాదాసు లక్ష్మణ్, ఆవుల నరేందర్, కొండ మల్లేశం, మద్దెగల్ల నరసింహ, ఎండి ఇమామ్ సాబ్, గొలుసుల ప్రసాద్, ఎండి అజార్,నంగునూరు విజయ్, వంగాల యాదయ్య, నారపాక అశోక్,నక్క శంకరయ్య, మందడి రవీందర్ రెడ్డి, బెడితే లింగం, స్కైలాబ్, పెండెం రవీందర్, మారోజు శ్రీనివాస చారి, దోమల యాదయ్య, దోమల ముత్తయ్య, మహిళా నాయకురాలు నర్రా అండాలు తదితరులు పాల్గొన్నారు.



## జై భీమ్ దీక్ష చేపట్టడం గర్వకారణం రామ్ సైదులు

**గరిడేపల్లి, మార్చి 7 (జనంసాక్షి):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలను ఆశయాలను అనుసరిస్తూ ముందుకు తీసుకెళ్తూ భారత రాజ్యాంగం గొప్పతనాన్ని చాటుతూ జై భీమ్ దీక్ష చేపట్టడం గర్వకారణం అని తెలంగాణ మాదిగ జెఏసి సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్ సైదులు అన్నారు. శనివారం గరిడేపల్లి మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పొనుగోడు గ్రామానికి చెందిన నందిపాటి నరహరి అంబేద్కర్ కి ఎంఆర్పీఎస్ గరిడేపల్లి మండల అధ్యక్షులు కొత్తపల్లి రవి నీలి కండువా కప్పి అంబేద్కర్ దీక్ష మాలను స్వీకరింపచేశారు. మానవ హక్కుల కోసం అంబేద్కర్ పోరాటం చేసి అందరికీ సమన్యాయం కల్పించేలా కృషి చేశారన్నారు.దళిత జాతి ఉద్ధరణ కోసం పాటుపడరన్నారు. 18 సంవత్సరాల నిండిన అందరికీ ఓటు హక్కు కల్పించడమే కాకుండా మహిళలు కార్మికుల కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పిడమర్తి అంజి, తెలంగాణ సంస్కృతి సంఘం నాయకులు కోట వీరస్వామి, స్ఫూర్తి యువజన సంఘం అధ్యక్షుడు అనంతు కర్ణాకర్ గౌడ్, జై భారత్ జిల్లా నాయకులు రణపంగా శ్రవణ్, వార్డు మెంబర్లు నకిరేకంటి రమేష్, రామ్ మధు, నాయకులు కీసరి నాగయ్య, పాతకోటి లింగారెడ్డి, నందిపాటి రమేష్, మేదారి రాంబాబు, పిట్ట నర్సయ్య, పందిరి చంటి తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ కార్యాలయాలలో పారిశుద్ధ్యం

**నూతనకల్ మార్చి 7 ( జనం సాక్షి)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నూతనకల్ లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీడీవో సునీత మాట్లాడుతూ కార్యాలయాలు పరిసరాలు శుభ్రం చేయడంతో పాటు ఆఫీసు రికార్డులు క్రమబద్ధికరించే కార్యక్రమాలు చేపట్టామని దీని ద్వారా కార్యాలయాలలో పారదర్శకత సమర్థత పెరగడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని వారు అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్,ఎంఈఓ రాములు నాయక్, వార్డు మెంబర్లు మాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, సురేందర్,వీరు యాదవ్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు,అంగన్వాడి టీచర్లు,శంబయ్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**మేళ్లచెరువు (జనం సాక్షి)** అంగన్వాడి కేంద్రంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సర్పంచ్ బచ్చు పద్మావతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మేళ్లచెరువు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఉప సర్పంచ్ పసుపులేటి నాగమణి నాగేశ్వరావు లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, కేంద్ర నిర్వాహణ సక్రమంగా జరుగుతున్నాయో లేదో అనే విషయాలను పరిశీలించి అంగన్వాడి సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులతో కాసేపు ఆత్మీయంగా మమేకమై వారితో సరదాగా మాట్లాడి వారికి ప్రోత్సాహం అందించారు. పిల్లల ఆరోగ్యం, పోషణ విద్యాభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





## బొమ్మకల్లులో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

మాడుగులపల్లి, మార్చి 07( జనం సాక్షి): సమాజ ప్రగతిలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని, నేటి మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా రాణిస్తున్నారని బొమ్మకల్లు గ్రామ సర్పంచ్ బొమ్మకంటి కల్పన కిరణ్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాడుగులపల్లి మండలం బొమ్మకల్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**కేక్ కట్ చేసి శుభాకాంక్షలు**

గ్రామ సర్పంచ్ కల్పన కిరణ్, పంచాయతీ సెక్రటరీ రాధా ఆధ్వర్యంలో మహిళలందరూ కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు శు భాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు విద్యే పునాది అని, చదువుకున్న మహిళా సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో తల్లి నిజమైన శ్రేయోభిలాషి అని, అమ్మతో మనసు విప్పి విషయాలు పంచుకుంటే చేసే తప్పులు తగ్గుతాయని ఆమె హితవు పలికారు.

**ఘనంగా సన్మానం**

గ్రామ అభివృద్ధిలో ప్రజల ఆరోగ్య రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బందిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు వారి సేవలను గుర్తించి గౌరవించడం తమ బాధ్యతని సర్పంచ్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పెరమళ్ళ రజిత, వార్డు మెంబర్లు వెలిజాల రమేష్, గణపతి కవిత, సావిత్ర, అంగన్‌వాడీ టీచర్ వెంకటమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు షబానా, చంద్రకళ, హెల్త్ స్టాఫ్ ఉమా, శిల్ప, ఆశా వర్కర్ మణెమ్మ మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

# పూర్ణగిరి లక్ష్మి నరసింహా స్వామి కళ్యాణానికి ఏర్పాట్లు పూర్తి

## ఆలయ చైర్మన్ రావి సురేందర్ రెడ్డి



భువనగిరి రూరల్, మార్చి 7 (జనంసాక్షి) భువనగిరి మండలం నమాత్ పల్లి గ్రామంలో శ్రీ పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రేపు జరగబోయే స్వామి, అమ్మవార్ల కళ్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ చైర్మన్ రావి సురేందర్ రెడ్డి తెలిపారు. కల్యాణానికి రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు హాజరవుతారని తెల్పుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. ఇక్కడి స్వామివారు స్వయంభువుగా వెలిశారని కొండపైన స్వామివారి పాదముద్రలు వుంటాయని వాటిలో జలం ఉంటుందని ఆ తీర్థాన్ని స్వీకరించిన భక్తులకు అనారోగ్యాలు తీరి ఆరోగ్యం పొందుతారని ఇక్కడి భక్తుల విశ్వాసం. స్వామి వారి కళ్యాణానికి దాదాపు 6 నుండి 7 వేల మంది భక్తులు హాజరవనున్నట్టు వారు తెలిపారు. కళ్యాణం అనంతరం స్వామివారి సన్నిధిలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం కలదని భక్తులు ఆలయ గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని సూచించారు. అలాగే భువనగిరి రురల్ ఎస్సై ఎం . అనిల్ కుమార్ మాట్లాడుతూ కల్యాణానికి వచ్చే భక్తులకు ఎటువంటి అనివార్య, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తిగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు జ్యోషి పవన్ కుమార్ శర్మ, ఆలయ ధర్మకర్తలు సురపంగ పద్మ నర్సింహా, ఎల్లంల జంగయ్య యాదవ్, బత్తిని సుధాకర్ గౌడ్, పబ్బతి ఉప్పలయ్య మరియు మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎల్లంల జంగయ్య యాదవ్, గుడి సేవకులు కొత్తపల్లి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



# వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి సన్నాహక సమావేశం లో పాల్గొన్న చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు





**చండూరు మార్చి 07 (జనంసాక్షి)**
నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఉదయాదిత్య భవన్' వేదికగా నిర్వహించిన ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళిక" ఉమ్మడి జిల్లా స్థాయి సన్నాహక సమావేశం అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు పాల్గొని, పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈ సమావేశాన్ని ప్రారంభించారు. జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమీక్షలో ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మరియు కలెక్టర్లు పాల్గొన్నారు.ఈ సమావేశంలో భాగంగా ప్రభుత్వం ప్రకటించిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడి శ్రీనివాసులు చండూరు మున్సిపాలిటీలో చేపట్టాల్సిన పనుల గురించి ప్రస్తావించారు.అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ. పేదలకు గృహనిర్మాణం మరియు పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాల అమలు, పట్టణంలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడం మరియు వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవడం.అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించబోమని మంత్రులు స్పష్టం చేసిన నేపథ్యంలో, అధికారులతో సమన్వయం చేసుకుంటూ చండూరును అభివృద్ధిలో ముందంజలో నిలుపుతామని డాక్టర్ కోడి శ్రీనివాసులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పాలనను ప్రజల చెంతకు చేర్చాలని నాయకులు పిలుపునిచ్చారు.ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసి, పారదర్శకమైన పాలన అందించేందుకు అధికారులందరూ బాధ్యతగా పనిచేయాలని సమావేశం తీర్మానించింది.



## గౌరీకుంట తండాలో మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన

### సర్పంచ్ రామావత్ దీప్లాల్ నాయక్

**కొండమల్లేపల్లి, మార్చి 7 (జనంసాక్షి):**
మహిళా సాధికారితకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం తాజాగా మహిళా సంఘాలకు సమాఖ్య భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలకు శాశ్వత వేదికగా ఉండేలా భవనాలు నిర్మించే విధంగా ప్రణాళికలు రూపొందించింది. ప్రతీ గ్రామంలో మహిళా పొదుపు సంఘం సమాఖ్య భవనాన్ని నిర్మించనుంది. మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుండటంతో మహిళా సమాఖ్య భవనాలకు శంకుస్థాపనలు ప్రారంభమయ్యాయి. కొండమల్లేపల్లి మండలంలో 31 సంఘ బంధాలకుగాను 20 భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో భవన నిర్మాణానికి సుమారు 10 లక్షలు వెచ్చించనున్నారు. శనివారం మండల పరిధిలోని గౌరీకుంట తండా గ్రామ పంచాయతీలో మహిళా సమాఖ్య భవనానికి సర్పంచ్ రామావత్ దీప్లాల్ నాయక్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఏఈ ఇందిరతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో చందుసాధ్ పూజారి, ఉపసర్పంచ్ రామావత్ అనిత చంటి, వార్డు సభ్యులు రామావత్ వినోద్, ఇంద్రవత్ వినోద్, మంజుల, రామావత్ మాత్రు, భీమా, కిషన్, గోరియా, కళ్యాణ్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు.



## అంగవైకల్యంలో ఉన్న మిత్రుడికి ఆర్థిక సహాయం

**కొండమల్లేపల్లి, మార్చి 7 (జనంసాక్షి):**
స్నేహం అంటే పరస్పర నమ్మకం, ఆప్యాయత, గౌరవం నిబద్ధతతో కూడిన ఒక మధురమైన బంధం స్నేహం కులం మతం వయస్సుతో సంబంధం లేకుండా ఇష్టపూర్వకంగా ఏర్పడే అత్యంత నిశ్శబ్దమైన బలమైన అనుబంధం కష్టసుఖాలను పంచుకుంటూ ఎలాంటి దాపరికం లేకుండా మనసు విప్పి మాట్లాడే చివరి శ్వాస వరకు తోడుండే నమ్మకమైన భాగస్వామ్యమే నిజమైన స్నేహం అని తోటి స్నేహితులు అక్షరాలా నిరూపించారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004 సంవత్సరం వరకు తమతో కలిసి చదువుకున్నటువంటి స్నేహితుడు మూడ ఆంజనేయులు వికలాంగుడు నిరుపేద కుటుంబం కావడంతో ఆంజనేయులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాన్ని పూర్తి చేసుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో విషయం తెలుసుకున్న తోటి పదవ తరగతి చిన్ననాటి స్నేహితులు అందరూ కలిసి ఎవరికి తోచినంత వారు కొంత ఆర్థిక సహాయాన్ని జమ చేసుకొని శనివారం స్నేహితుడి స్వగ్రామమైనటువంటి నాంపల్లి మండలం పగిడిపల్లి గ్రామానికి వెళ్లి తమ చిన్ననాటి స్నేహితుడు ఆంజనేయులకు 45 వేల రూపాయల నగదు ఆర్థిక సాయాన్ని అందజేసి స్నేహితులు పెద్ద మనసు చాటుకున్నారు. ఈ సందర్భంగా స్నేహితుడు తనకు ఆర్థిక సాయం అందజేసిన తోటి స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపాడు. నగదును అందజేసిన వారిలో స్నేహితులు ఆర్. సత్యనారాయణ, కే. సాయన్న, బి. లింగం, బి. రామకృష్ణ, జె. వెంకటయ్య, సునీత, అలివేలు, రజిత, శిరీష, రమేష్, యాదగిరి, సత్యనారాయణ స్నేహితులు పాల్గొన్నారు.



## భువనగిరిలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణకు శ్రీకారం

**భువనగిరి పట్టణం, మార్చి 7 (జనంసాక్షి)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం భాగంగా భువనగిరి పురపాలక సంఘ పరిధిలో శనివారం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మార్చి 6 నుంచి మార్చి 15 వరకు ఈ కార్యాచరణ కొనసాగనుంది.ఈ నేపథ్యంలో 07-03-2026న భువనగిరి పురపాలక సంఘ పరిధిలోని 2,7,19,14,26 వార్డుల్లో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ, భువనగిరి పురపాలక సంఘ పరిధిలోని మొత్తం 35 వార్డుల్లో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతం, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.అనంతరం భువనగిరి పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాల్లోని చెత్త చెదారాన్ని తొలగించి, విరిగిపోయిన ఫర్నిచర్, కుర్చీలు మరియు ఇతర సామగ్రిని తొలగించారు. అలాగే రికార్డు రూం నిర్వహణను మెరుగుపరచడంతో పాటు వివిధ వార్డుల్లో ఫాగింగ్, చెరువు కట్టల వద్ద శుభ్రత పనులు చేపట్టారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం, పరిశుభ్రత మరియు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ను విజయవంతం చేయాలని అధికారులు తెలిపారు.

## హెచ్ టి విత్తనాల వల్ల కలిగే నష్టాలు పె అవగాహన



**వలిగొండ, మార్చి 7 ( జనం సాక్షి)**
మండలంలోని వేములకొండ గ్రామంలో రైతు వేదికలో ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన వ్యవసాయసాంకేతిక పరిజ్ఞానంపై ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత రైతులకి శిక్షణ కార్యక్రమం లోఅవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వరి, పత్తి పంటలయాజమాన్య పద్ధతుల గురించి, సేంద్రియ వ్యవసాయం దాని యొక్క ప్రయోజనాల గురించి, నానో యూరియా ప్రయోజనాలను, విత్తన ఎంపికలు తీసుకోవలసిన జాగ్రత్తలను, అధిక సాంద్రత పత్తి సాగు గురించి దాని ప్రయోజనాల గురించి, నిషేధిత హెచ్ టి పత్తి విత్తనాల వలన కలిగే నష్టాల గురించి రైతులకు వివరించడం జరిగింది అలాగే మండలం వ్యవసాయ అధికారిని అంజనీ దేవీ పచ్చి రొట్టె ఎరువులు ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్య క్రమంలో వెంకటాపురం గ్రామ సర్పంచ్ కలమ్మ యాదయ్య , వేములకొండ గ్రామం ఉప సర్పంచ్ సాయికుమార్ , ఏఈవో లు భగీరథ, సాయి, రైతులు పాల్గొన్నారు

## జీనియస్ పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**భువనగిరి పట్టణం, మార్చి 7 (జనంసాక్షి)**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జీనియస్ పాఠశాల ప్రాంగణంలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినిలతో పాటు వారి మాతృమూర్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ మహిళలు కుటుంబానికి, సమాజానికి పునాది లాంటి వారని పేర్కొన్నారు. అమ్మగా, భార్యగా, సోదరిగా, కూతురుగా మమతా అనురాగాలు పంచే స్త్రీ ఇంటిని, దేశాన్ని ప్రగతి పథంలో నడిపించే శక్తి స్వరూపిణి అని అన్నారు. మహిళల ప్రేమ, త్యాగం, సహనానికి ప్రతీకలుగా నిలిచే వారి సేవలను కొనియాడారు. అనంతరం పాఠశాల యాజమాన్యం మహిళలకు మహిళా దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేసి మ్యూజికల్ ఛైర్, అంత్యాక్షరి వంటి ఆటపాటల కార్యక్రమాలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి. స్వర్ణలత, ఏవో జి. రవి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



## మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు:ఏడుదొడ్ల శ్వేత రవీందర్ రెడ్డి

**నాంపల్లి, మార్చి 07 (జనంసాక్షి)**
ప్రతి సంవత్సరం మార్చి 8 న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నాంపల్లి మండల మాజీ ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేత రవీందర్ రెడ్డి జనం సాక్షి తో మాట్లాడుతూ మహిళా దినోత్సవం అనేది కేవలం పండుగ మాత్రమే కాదు, మహిళల పోరాటాలను గుర్తించి, వారి విజయాలను వేడుక చేసుకుంటూ, లింగ సమానత్వం కోసం ప్రతిజ్ఞ చేసే ఒక మహోజ్వల సందర్భం. మనం మహిళలకు సమాన అవకాశాలు, విద్య, గౌరవం,మద్దతును ఇచ్చి నప్పుడు, ప్రతిఫలంగా సమాజం మొత్తం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధిని పొందు తుంది. మహిళల హక్కులు కేవలం కాగితాల మీద ఉండటమే కాకుండా, అవి ఆచరణలోకి రావాలని, వారికి వేగంగా న్యాయం అందాలని అన్నారు.నేటి భారత దేశంలో మహిళా శక్తి నేడు భారతదేశంలో మహిళలు ఆకాశమే హద్దుగా రాణిస్తున్నారు రాజకీయాల్లో, రక్షణ రంగంలో క్రీడల్లో మన మహిళా మణులు అగ్రగామిగా నిలుస్తున్నారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను అమలు చేస్తున్నాయి. అయినప్పటికీ, ఇంకా సమాజంలో మహిళలపై వివక్ష, భద్రతా పరమైన ఆందోళనలు పూర్తిగా తొలిగిపోలేదు. మహిళా దినోత్సవం రోజున కేవలం శుభాకాంక్షలు చెప్పి వదిలేయకుండా, నిత్య జీవితంలో ఈ క్రింది మార్పులు తీసుకురావాలి ఇంట్లో ఉన్న మహిళల శ్రమను గుర్తించి, వారికి పనుల్లో తోడుగా ఉండటం,ఆడపిల్లల చదువుకు, వారి కలలకు అడ్డు పడకుండా ప్రోత్సహించడం ,మహిళలు బయటకు వెళ్ళినప్పుడు సురక్షితమైన వాతావరణం ఉండేలా బాధ్యతగా వ్యవహరించడం, స్త్రీ లేనిదే సృష్టి లేదు మహిళ సాధికారత సాధించినప్పుడే దేశం ప్రగతి పథంలో పయనిస్తుంది. ఈ మహిళా దినోత్సవం సందర్భంగా, మన చుట్టూ ఉన్న మహిళలందరికీ గౌరవాన్ని, తోడ్పాటును అందిస్తామని ప్రతిన చేద్దాం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.



## నాంపల్లి మండల ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి:కత్తి రవీందర్ రెడ్డి

**నాంపల్లి,మార్చి 07(జనంసాక్షి)**



నాంపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్చి 15 తారీఖున (ఆదివారం) ఉదయం 9 గంటలకు నాంపల్లి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరం మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో నిర్వహించబడును 50 సంవత్సరాల వయసు పైబడిన వారు విధిగా ఆధార్ కార్డుతో పాటు, మీ ఫోన్ నెంబర్,గతంలో మీరు వాడుతున్న మందులను కూడా వెంట తీసుకవచ్చి కంటి వైద్య శిబిరంలో పాల్గొనాలని,కంటి శుక్లాల ఆపరేషన్ అవసరం ఉన్న వారిని వెంటనే హైదరాబాద్ తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి తీసుకొస్తారు ఈ అవకాశాన్ని ప్రజలు అందరు సద్వినియోగం చేసుకోవాలి అని కోరారు.ప్రతి ఇంట్లో ఒక్క పెద్ద కొడుకుల ప్రతి అవ్వ కష్టాలను తెలుసుకొని వారికి మళ్ళీ చూపు తెప్పిస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి నాంపల్లి మండల ప్రజల తరుపున ధన్యవాదాలు తెలియజేశారు.



## విద్యార్థులు చదువుతో పాటు
# క్రీడల్లోనూ రాణించాలి

### ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్

### అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు చందన ఎం

**చౌటుప్పల్ మార్చి 7(జనంసాక్షి)**
చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ తెలిపారు.గట్టుప్పల మండల కేంద్రానికి చెందిన పగిళ్ల చందన బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో జిల్లా స్థాయి నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించి, జాతీయ స్థాయిలో సత్తా చాటిన ఆమె, ఇప్పుడు భారత జట్టు తరపున అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారు. థాయిలాండ ్లో జరిగే అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు నేడు(ఆదివారం) ఆమె బయలుదేరనున్నారు. శనివారం ఆమెను ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ చందన, కోచ్ పి జంగయ్యలను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చందన థాయిలాండ్ పర్యటనకు అయ్యే ఖర్చులను భరిస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు తమ ఫౌండేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

## మహిళలు స్వశక్తితో ఎదగాలి

### పాలనలో దూసుకుపోతున్న దీర వనితలు
### మహిళలు చట్టాలపై అవగాహనాతో ధైర్యంగా పోరాడాలి
### నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పున్న శైలజ వెంకటేశ్వర్లు, దేవరకొండ మున్సిపల్ చైర్ పర్సన్

**దేవరకొండ, మార్చి 07(జనం సాక్షి)**



సంవత్సర కాలంలో మహిళలు సాధించిన విజయాలను స్మరించుకుంటూ ముందు తరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా ప్రపంచ వ్యాప్తంగా మార్చి 8వ తేదీని అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటామని దేవరకొండ మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు తెలిపారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ స్త్రీలు ఎక్కడ పూజించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని,స్త్రీ ఔన్నత్యానికి సమాజంలో వారికి ఉన్న ప్రాధాన్యతకు మన భారతీయ సంస్కృతి ఇచ్చిన గొప్ప గౌరవమని అన్నారు. నేటి యుగంలో మహిళలు ఎలాంటి నిర్ణయమైనా స్వతంత్రంగా తీసుకునే స్థాయికి ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అక్షరాస్యత పెరిగిన రోజు నిజమైన అభివృద్ధి కనిపిస్తుందని,గ్రామీణ ప్రాంతాలలో మహిళలు అక్షరాస్యులుగా మారినప్పుడే అవకాశాలు అంది పుచ్చుకోగలరని అన్నారు.ప్రస్తుతం మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, అమ్మాయిలు చిన్ననాటి నుంచి ఉన్నత లక్ష్యం ఏర్పాటు చేసుకుని, వాటిని సాధించుకోవడానికి ముందడుగు వేయాలని, ఈ ప్రయాణంలో ఎలాంటి అడ్డంకులు వచ్చిన దీటుగా ఎదుర్కొని ముందుకు సాగాలని, మహిళలు వంటింటికే పరిమితం కాకుండా రాజకీయ రంగంగా రాణించేందుకు ముందుకు రావాలని అన్నారు.ఇదంతా సాధించాలంటే కుటుంబం నుంచి ప్రోత్సాహం ఉండాలని అన్నారు.

## నాగార్జున స్కూల్లో ఘనంగా అంతరాతీయ మహిళా దినోత్సవం



**రామన్నపేట, మార్చి 7 (జనంసాక్షి):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని నాగార్జున స్కూల్లో ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు సమాజానికి ఆదర్శంగా నిలిచిన గొప్ప మహిళా మణుల వేషధారణలో రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో తమ కర్తవ్య నిర్వహణలో ముందుంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారన్నారు. విద్యార్థినుల ఉన్నతమైన చదువు సమాజాభివృద్ధికి నాంది అన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ రేఖ మాట్లాడుతూ ఈ మహిళా దినోత్సవం థీమ్ గివ్ టు గైన్. మహిళలకు ఇచ్చే గౌరవం, సహకారం, అవకాశాలు మనందరి వృద్ధికి దోహదం చేస్తాయన్నారు. మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రాతినిథ్యాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది సంధ్య, స్వప్న, విజయశ్రీ,,లత,నరసింహ,వినిష తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం




**చిలుకూరు, మార్చి 07 (జనంసాక్షి):**
చిలుకూరు మండల కేంద్రంలో పీఎం శ్రీ జెడ్ పి ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను, బోధనేతర మహిళలను, మహిళా ప్రజా ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొల్లు పుల్లమ్మ మాట్లాడుతూ మహిళలు సామాజికంగా,ఆర్థికంగా, రాజకీయ రంగాలలో విజయాలు సాధించాలని అన్నారు. మహిళలు సమానమైన హక్కులు, సమానత్వం, సాధికారత కోసం పాటుపడాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు రాజారావు మాట్లాడుతూ ఇల్లాలి చదువు ఈ జగతికి వెలుగులు నింపుతుందని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో రంజాన్ బి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి

### బిజెపి రాష్ట్ర నాయకులు సిహెచ్ శ్రీనివాస్

**రామన్నపేట, మార్చి 7 (జనంసాక్షి):**
విద్యార్థులు ఎటువంటి మానసిక ఒత్తిడి, భయం లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని బిజెపి రాష్ట్ర నాయకులు సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఇంద్రపాలనగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకులు చిన్నపాక శ్రీనివాస్ తన సొంత ఆర్థిక సహకారంతో పరీక్ష ప్యాడ్‌లను, పెన్నులను గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ తో కలిసి పంపిణీ చేసి ఔదార్యాన్ని చాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి



**గరిడేపల్లి, మార్చి 7 (జనంసాక్షి):**
మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఎంఈఓ ప్రధానోపాధ్యాయుడు పానుగోతు ఛత్రునాయక్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలో ఉన్నటువంటి ఉపాధ్యాయనీలను శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని అందులో ఉపాధ్యాయ వృత్తిలో ఉండటం ఇంకా ఎంతో మంచిదని ఎందుకనగా తల్లి తన పిల్లలకు ఏ విధంగానైతే మంచి బుద్ధులను నేర్పుతుందో అదే విధంగా పాఠశాలల్లో ఉన్న విద్యార్థినీ విద్యార్థులు అందరినీ కూడా తమ పిల్లలుగా భావించి మంచి చెడులను తెలుపుతూ చక్కటి విద్యా బోధన చేస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# స్టెమ్స్‌స్పార్క్ రెజొనెన్స్ శ్రీనగర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు

**ఖమ్మం, (జనంసాక్షి ) :**



ఖమ్మం నగరంలో గల స్థానిక శ్రీనగర్ కాలనీలోని, స్టెమ్స్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్కూల్ డైరెక్టర్ కొండా కృష్ణవేణి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొండా కృష్ణవేణి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, సంప్రదాయంగా, రాజకీయంగా ఎన్నో అవరోదాలను అధిగమించి వారు పొందిన అద్భుతమైన నైపుణ్యాలను, విజయాలకు సూచికగా ప్రతి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని, మహిళా సాధికారతే దేశాభివృద్ధి అని మహిళలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ సిరి సంపదలు, విజయాలు సిద్ధిస్తాయని తెలియజేశారు. నేటి బాలికలు కూడా ఆదర్శ మహిళల దారిలో నడిచి పోటి ప్రపంచంలో నిలవాలని విద్యార్థులలో స్ఫూర్తిని నింపారు. అందరికి "మహిళా దినోత్సవ శుభాకాంక్షలు" తెలియజేసారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీ అని, స్త్రీలను గౌరవించడం అందరి విధి అని సావిత్రిబాయి పూలె, మదర్ థెరిస్సా, మలాల యూసఫ్ జాయ్, కల్పనా చావ్లా వంటి ఎందరో మహిళలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారు. స్టెమ్స్‌స్పార్క్ రెజొనెన్స్ శ్రీనగర్ స్కూల్‌లో బాలికలు ఆత్మ విశ్వాసం, పోటీతత్వం కలిగి ఉండాలంటూ అన్ని రంగాలలో తీర్చిదిద్దాడానికి ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నామని బాలికలను తిరుగులేని శక్తులుగా మారుస్తామని తెలియజేస్తూ అన్ని రంగాలలో మహిళా సాధికారత సాధించాలని ఆశిస్తూ మహిళలందరికి జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉన్నత విద్యను అభ్యసించి నిష్ణాతులైన ఉపాధ్యాయులుగా బోధనేతర సిబ్బందిగా స్టెమ్స్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో తమ సేవలను అందిస్తున్న మహిళలందరిని అభినందిస్తూ అంకితభావంతో తమ వ త్తిని నిర్వహిస్తున్న మహిళా ఉపాధ్యాయులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



# కుబేర ఆంజనేయస్వామి ప్రతిష్ట కరపత్రాలు ఆవిష్కరణ

**పెనుబల్లి,మార్చి 7(జనంసాక్షి)**

పెనుబల్లి మండలం పెనుబల్లి బీసీ కాలనీ వద్ద ఏర్పాటుచేసిన కుబేర ఆంజనేయ స్వామి వారి ప్రతిష్టా మహోత్సవానికి సంబంధించిన కరపత్రాలను గ్రామస్తులు శనివారం ఆవిష్కరించారు.ఈ నెల 24వ తేది మంగళ తోరణం గణపతి సహిత కుబేర ఆంజనేయ స్వామి వారి జలాభిషేకము, గ్రామోత్సవము 25వ తారీకు గణపతి పూజతో ప్రారంభమై స్వామివారి ప్రాణ ప్రతిష్ట, అన్నదానము స్వామి వారి శాంతి కళ్యాణము బలిహరణ తదితర కార్యక్రమాలు నిర్వహింపబడతాయని పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పెద్దలు, ఆడపడుచులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ ఇంద్రగంటి మహేష్ శర్మ, ఆచంటి శ్రీనివాసరావు, తేజావత్ బిక్కు, తేజావత్ సుక్కు, భూక్యా బాలాజీ, నల్లయన్ చంద్రం, భూక్య రాము, తేజావత్ మంగు, సుంకర నాగయ్య, వంగా సత్యనారాయణ, చిట్లూరు సత్యనారాయణ, షేక్ పాషా, మిట్టపల్లి నరేంద్ర,మిట్టపల్లి కిరణ్ కుమార్, అనుమోలు సాంబశివరావు, జిల్లెల్ల కృష్ణ, జె.వి, సుంకర రామారావు, సింగిశాల రాంబాబు, మద్దెల రమేష్, బెజవాడ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో నిరుపేదకు అన్నం ఫౌండేషన్ అంత్యక్రియలు

**ఖమ్మం, (జనంసాక్షి) :**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామానికి చెందిన కంపాటి వెంకటేశ్వర్లు (60) మరణించగా అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. చిన్న వయసులోనే ఇంటి నుంచి వెళ్లిపోయిన వెంకటేశ్వర్లు ఒంగోలులో 25 సంవత్సరాలు జీవించి, అనంతరం ఖమ్మంలో స్థిరపడ్డారు. వేణుగోపాల్ నగర్‌లో నివసిస్తూ బ్యాండ్ మేళంలో మేళం వాయిస్తూ పెళ్లిళ్లు, చావులకు వెళ్లి జీవనం సాగించేవారు.మూడు నెలల క్రితం పక్షవాతం రావడంతో ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందిన ఆయనను అనంతరం అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. అక్కడ పది రోజులుగా సంరక్షణ పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో డెత్ డిక్లరేషన్ చేయించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో మేళ తాళాలతో, తెల్లవస్త్రం, పూలదండతో నివాళులర్పించి బల్లేపల్లి వైకుంఠ ధామంలో దహన సంస్కారం నిర్వహించారు. కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# ఖమ్మం జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షులుగా డాక్టర్ కాపా మురళి కృష్ణ

**వైరా మార్చి 7 జనంసాక్షి**

ఖమ్మం జిల్లా డాక్టర్స్ సెల్ అద్యక్షులుగా డాక్టర్ కాపా మురళి కృష్ణ కు నియామక పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర డాక్టర్స్ సెల్ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షులు గా నియమించిన తెలంగాణ రాష్ట్ర డాక్టర్స్ సెల్ అధ్యక్షులు రాజీవ్ రెడ్డికి, నియామకానికి సహకరించిన జిల్లా మంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, పార్లమెంట్సభ్యులు రామసహాయం రఘు రామిరెడ్డి ,శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్, మట్టా రాగమయి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ లకు ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ పటిష్ట పరచేందుకు అహర్నిశలు కృషి చేస్తానని, పార్టీ అభివృద్ధికి ఎల్లవేళలా పాటు పడతానని,కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు అన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు రంగా జనార్ధన్,కాంగ్రెస్ నాయకులు తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్ రాయి లు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన డిసిహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తన సొంత కారులో ఆసుపత్రిలో చికిత్స అందించిన డిసిహెచ్ఎస్

**వైరా మార్చి7 న(జనంసాక్షి)**

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తన సొంత వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు డి సి హెచ్ ఎస్ రాజశేఖర్ గౌడ్. ఖమ్మం సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పనిచేస్తున్న బాలకృష్ణ తనికెళ్ళ గ్రామంలో కుక్క అడ్డురావడంతో బైక్ పైన నుంచి పడ్డాడు. దీంతో కృష్ణకు గాయాలు కావడంతో అప్పుడే అటుగా నుంచి వస్తున్న డి సి హెచ్ రాజశేఖర్ గౌడ్ తన వాహనాన్ని ఆపి స్వయంగా తానే తన వాహనంలోని ఎక్కించుకొని వైరాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు .సకాలంలో స్పందించి చికిత్స చేయడం ద్వారా గాయపడిన వ్యక్తి ప్రమాదం నుండి బైట పడ్డాడు.మెరుగైన చికిత్స అందించి సకాలంలో స్పందించి తన వాహనంలో ఆసుపత్రి తరలించినందుకు గాను పలువురు హర్షం వ్యక్తం చేశారు.






# స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఘనంగా మహిళ దినోత్సవం

**ఖమ్మం మార్చి 7, (జనంసాక్షి) :**

స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య మహిళా ఉపాధ్యాయులతో కలిసి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులు రోల్ ఆఫ్ ఉమెన్ అనే అంశంపై ఉపన్యాస పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య మాట్లాడుతూ ఆకాశంలో సగభాగంగా ఉన్న మహిళలు రాజకీయ, సామాజిక, ఆర్థిక శక్తిగా ఎదగాలని కోరారు. మహిళల ప్రాధాన్యతను తెలియజేసేందుకు తమ పాఠశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందించామని తెలిపారు. మహిళలు అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# త్రివేణిలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఖమ్మం, (జనంసాక్షి) : ఖమ్మం పట్టణంలోని స్థానిక విద్యా సంస్థ త్రివేణి టాలెంట్ స్కూల్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మహిళా సాధికారత, మరియూ వారి విజయాలను తలచుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని, ప్రస్తుతమున్న సమాజం లో మహిళలు అబలలు కాదు సబలలు అని తెలియజేశారు, స్త్రీ లేకపోతే మానవ మనుగడే లేదని,ఆడపిల్లలని ఎదగనివ్వాలని,వారు ఉన్నత ఉద్యోగాలు చేయాలని, డిఫెన్స్ లాంటి రక్షణ రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మన దేశానికి ఎంతో సేవలందించిన మదర్ థెరిసా సావిత్రిబాయి పూలే ,ఝాన్సీ లక్ష్మీబాయి.అలాగే అంతర్జాతీయ స్థాయిలో మన ఖ్యాతిని ఇనుమడింపజేసిన క్రీడాకారులైన పీవీ సింధు మేరీ కోమ్ ల యొక్క విజయాలను స్మరించుకున్నారు అదేవిధంగా ఇక్కడున్న బాలికలంతా కూడా వారి వారికి నచ్చిన రంగాలలో అత్యుత్తమంగా రాణించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. తదనంతరం జరిగిన కార్యక్రమంలో పాఠశాలలో పనిచేస్తున్న మహిళ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ టీం అర్చన ఠాకూర్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్, వైస్ ప్రిన్సిపల్ ముస్తఫా, స్వప్న మహిళా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అలాగే బాలికలు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో

# సర్పంచ్ పారిశుధ్య పనులు

**బూర్గంపహాడ్ మార్చి 07 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గుపహాడ్ మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ సర్పంచ్ బొర్రా సుభద్ర ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని గ్రామపంచాయతీ పరిసరాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ప్రైమరీ స్కూల్, సంత సముదాయాలు, అంగన్వాడీ కేంద్రాల్లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సముదాయాల్లో శుభ్రత, పరిశు భ్రతను పాటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాటు ఉపసర్పంచ్ పొక్కుల రవి, పాలకవర్గ సభ్యులు రొండా పుల్లారెడ్డి, కార్యదర్శి భవానీ, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.